సాక్షి
రంగారెడ్డి
శనివారం ၊ 26 ၊ అక్టోబర్ ၊ 2024



నిధులు లేక నీరసం

సరిహద్దు రోడ్డుకు గ్రహణం పట్టింది. శిలా ఫలకం వేసి ఏడాది గడుస్తున్న మరమ్మతు పనులు ముందుకు సాగడం లేదు. 10లో▸



పటిష్టం చేయాలి

ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్ట పరచాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ అన్నారు. 10లో▸



విజయవంతం చేయండి

ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని పంచాయతీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి కోరారు. 10లో▸

కులగణనకు రెడీ

- వచ్చేనెల 7న జిల్లాకు రానున్న బీసీ కమిషన్
- అభిప్రాయాలు సేకరించనున్న బృందం సభ్యులు
- జనాభా నిష్పత్తి ఆధారంగా 'స్థానిక' ఎన్నికల్లో రిజర్వేషన్లు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: కుల గణనకు అంతా సిద్ధమైంది. ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఉన్నత న్యాయస్థానం సైతం ఇద్దే అంశాన్ని స్పష్టం చేయడంతో సాధ్యమైనంత త్వరలో ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాలోని గ్రామ పంచాయతీలు, మండలాలు, వార్డుల వారీగా సర్వే నిర్వహించి బీసీ ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తోంది. జనాభా నిష్పత్తి ఆధారంగా పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు కేటాయించనుంది. ఇదిలా ఉండగా 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 24,46,265 మంది ఉండగా, ప్రస్తుతం వీరి సంఖ్య 40 లక్షలు దాటినట్లు అంచనా. ప్రస్తుతం 18 ఏళ్ల పైబడి ఓటు హక్కు పొందిన వారు 35,91,987 మంది ఉన్నారు. ఆ లోపు వారు మరో పది లక్షల వరకు ఉన్నట్లు అంచనా. ఈ 13 ఏళ్లలో ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీల జనాభా కూడా గణనీయంగా పెరిగింది. బీసీ జనగణన చేపడితే ఏ సామాజిక వర్గం ప్రజలు ఎంతమంది ఉన్నారనే అంశం కూడా స్పష్టమవుతుంది. తద్వారా గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు లభించే అవకాశం ఉంటుంది. మెజార్టీ వర్గం ఉన్న కులానికి చట్ట సభల్లో మరింత ప్రాధాన్యత లభించే చాన్స్ లేకపోలేదు. అంతేకాదు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల కింద ఆయా కులాలకు అందజేస్తున్న ఆర్థిక సహాయం కూడా పెరగనుంది.

అభిప్రాయాలు తెలుసుకునేందుకు

స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 7న జిల్లాకు రానుందని కలెక్టర్ శశాంక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి, వికారాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం అభిప్రాయ సేకరణ జరుపనుందని వెల్లడించారు. తమ అభిప్రాయాలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక అభ్యర్థనలను స్వయంగా అందజేయవచ్చని సూచించారు. అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరు సెట్లను తెలుగు లేదా ఆంగ్ల భాషలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలు, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్‌కు నివేదించవచ్చని కలెక్టర్ వివరించారు.

తుది జాబితా ప్రకారం జిల్లాలోని ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
అబ్దుల్లాపూర్‌మెట్	17,548	17,597	4	35,149
ఆమనగల్లు	7,247	7,160	–	14,407
చేవెళ్ల	29,200	29,097	2	58,299
ఫరూఖ్‌నగర్	24,883	24,997	3	49,883
ఇబ్రహీంపట్నం	15,378	15,558	2	30,938
జిల్లెడు చౌదరిగూడెం	12,659	12,386	4	25,049
కడ్తాల్	17,214	16,314	1	33,529
కందుకూరు	25,577	25,191	1	50,769
కేశంపేట	17,848	18,013	1	35,862
కొందుర్గు	11,489	11,705	–	23,194
కొత్తూరు	8,162	8,019	1	16,182
మాడ్గుల	22,488	21,563	–	44,051
మహేశ్వరం	21,591	21,438	4	43,033
మంచాల	20,337	19,656	1	39,994
మొయినాబాద్	30,613	29,880	2	60,495
నందిగామ	13,409	13,460	2	26,871
షాబాద్	24,313	23,740	1	48,054
శంషాబాద్	16,314	16,516	1	32,831
శంకర్‌పల్లి	20,086	20,314	1	40,401
తలకొండపల్లి	18,807	18,357	1	37,165
యాచారం	24,241	24,253	1	48,495

న్యూస్‌రీల్

కడ్తాల్ ఠాణాలో షాద్‌నగర్ ఏసీపీ ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

కడ్తాల్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం మాధ్యాహ్నం షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు, వారి సమస్యలపై ఆరా తీశారు. సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, స్టేషన్‌లోని సిబ్బంది వివరాలు, రికార్డుల నిర్వహణ, కేసుల స్థితిగతులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, క్రైం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా పనిచేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తిస్తూ, శాంతి భద్రతలను అదుపులో ఉంచాలన్నారు. ఏసీపీ వెంట సీఐ శివప్రసాద్, ఎస్ఐ శివశంకర వరప్రసాద్, రైటర్ శ్యాంసన్ తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

షాద్‌నగర్‌రూరల్: శాంతి భద్రత పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఏసీపీ రంగస్వామి తెలిపారు. శుక్రవారం రాత్రి ఫరూఖ్‌నగర్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. ఏసీపీ రంగస్వామి నేతృత్వంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 70 మంది పోలీసు సిబ్బంది ఆరు బృందాలుగా ఏర్పడి ఫరూఖ్‌నగర్‌లోని కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను, వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల రక్షణలో భాగంగా నాకాబందీ నిర్వహించామన్నారు. ప్రార్థనా మందిరాల వద్ద, కిరాణా దుకాణాలు, వాహనాలను తనిఖీ చేసినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో మూడు ఎక్సైజ్ కేసులు, రెండు గుట్కా కేసులు, మూడు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులతో పాటు మూడు వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు విజయ్‌కుమార్, నర్సయ్య, నరహరి, ప్రమోద్, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పశుగణన సర్వే షురూ



చేవెళ్ల: పశు సంపద లెక్కలు తెలుసుకునేందుకు పశుగణన సర్వే చేపట్టినట్టు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్‌కుమార్ అన్నారు. దేశవ్యాప్తంగా చేపడుతున్న సర్వే కార్యక్రమాన్ని జిల్లాలోని చేవెళ్లలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఐదేళ్లకోసారి పశుగణన జరుగుతుందని చెప్పారు. నాలుగు నెలల్లో సర్వే పూర్తి చేయడం జరుగుతుందన్నారు. దీనికి సంబంధించి డివిజన్ల వారీగా సిబ్బందిని కేటాయించడం జరిగిందన్నారు. ఈ సర్వేతో ప్రతి గ్రామంలో ఉన్న ఆవులు, ఎద్దులు, బర్రెలు, మేకలు, గొర్రెలు, ఇలా అన్ని రకాల జంతువుల లెక్కలు పక్కగా తెలుస్తాయన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల సహాయ సంచాలకుడు కె. తిరుపతిరెడ్డి, పశువైద్యుడు డాక్టర్ దేవేందర్ రెడ్డి, పశుగణన కో ఆర్డినేటర్ డాక్టర్ మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ శ్రీలత

తప్పులు పునరావృతం కావొద్దు

- నిబంధనలు తప్పక పాటించాలి
- ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో డీఆర్డీఏ పీడీ శ్రీలత

కేశంపేట: ఉపాధి హామీ పథకంలో నిబంధనల మేరకు పనులు నిర్వహించాలని డీఆర్డీఏ పీడీ శ్రీలత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ, ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో నిర్వహించే పనుల్లో గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. ఇటీవల నిర్వహించిన సర్వేల్లో తప్పులు జరిగినట్టు గుర్తిస్తే వాటిని వెంటనే సరి చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలోని 29 గ్రామాల పరిధిలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల విలువ రూ.1,35,91,583 కోట్లు, మెటీరియల్‌కు రూ.11,71,394 నిధులు వచ్చినట్లు తెలిపారు. 29 గ్రామాలకుగాను 15 గ్రామాల పనులను నిర్వహించారు. మిగిలిన గ్రామాల లెక్కలను నేటి సమావేశంలో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ సునీత, సీనియర్ క్వాలిటీ కంట్రోలర్ భానుశంకర్, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్ సునీత, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారులు కొండలయ్య, గతమ్ స్టేట్ రిసోర్స్ పర్సన్ రంగనాథ్, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, ఏపీఎం భగవంతు తదితరులు పాల్గొన్నారు.

ఒకే పోలీసు విధానం అమలు చేయాలి

టీజీఎస్‌పీ 8వ బెటాలియన్ పోలీసు కుటుంబ సభ్యుల మెరుపు ధర్నా



ధర్నా చేస్తున్న పోలీసుల కుటుంబ సభ్యులు

గచ్చిబౌలి: ఒకే పోలీసు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కొండాపూర్ టీజీఎస్‌పీ 8వ బెటాలియన్ పోలీసుల కుటుంబ సభ్యులు మెరుపు ధర్నాకు దిగారు. శుక్రవారం రాత్రి కొండాపూర్ 8వ బెటాలియన్‌లో నివాసం ఉండే పోలీసుల కుటుంబ సభ్యులు ప్రధాన రహదారిపై బైఠాయించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్న పోలీసు విధానాన్ని అమలు చేయాలని, కానిస్టేబుళ్లకు సెలవుల విషయంలో ఒకే పోలీసు విధానాన్ని ఆచరణలో పెట్టాలని ప్లకార్డులతో నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిరసన తెలిపిన టీజీఎస్‌పీ పోలీసుల కుటుంబ సభ్యులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సెలవులు రద్దు చేస్తూ పోలీసు శాఖ ఇచ్చిన ఉత్తర్వులు పూర్తిగా వెనక్కు తీసుకోవాలని అన్నారు. కొండాపూర్ పోలీసు బెటాలియన్ కమాండెంట్ సి.సన్నీ ధర్నా వద్దకు చేరుకొని వారితో చర్చలు జరిపారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని సర్దిచెప్పడంతో వారు ధర్నా విరమించారు. ధర్నా కారణంగా సుమారు 3 కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గచ్చిబౌలి పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

మొయినాబాద్: గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం మండలంలోని పరీక్ష కేంద్రాల్లో 58 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన 31వ సెంటర్‌లో 600 మంది అభ్యర్థులకుగాను 358 మంది, 32వ సెంటర్‌లో 600 మందికి 348 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. తహసీల్దార్ గౌతమ్‌కుమార్ పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో..

మొయినాబాద్‌రూరల్: మండలంలోని ఆయా ఇంజనీరింగ్ కళాశాలల్లో జరుగుతున్న గ్రూప్–1 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు. అజీజ్‌నగర్ చౌరస్తాలోని విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షకు 984 మందికి గాను 579 మంది హాజరు కాగా అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఆర్ఈసీ ఇంజనీరింగ్ కళాశాలలో 816 మందికి గాను 445 మంది హాజరైనట్లు చెప్పారు.



మొయినాబాద్: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి శ్రీధర్‌బాబు

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవానికి వెళ్తున్న ఆయనకు శుక్రవారం పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలు చేపడుతున్నారని చెప్పారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్‌గా ఎన్నిక కావడం శుభపరిణామమని అన్నారు. మంత్రిని కలిసినవారిలో చెంది తిరుపతిరెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, అగ్గనూరు విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, వన్నాడ ప్రకాష్, పురుషోత్తం, సుదర్శన్ తదితరులు ఉన్నారు.



మంత్రి శ్రీధర్‌బాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఇతర నాయకులు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



హైతాబాద్‌లో బోరుమోటారును పరిశీలిస్తున్న డీపీఓ సురేశ్‌మోహన్

షాబాద్: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీపీఓ సురేశ్‌మోహన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హైతాబాద్ గ్రామాన్ని శుక్రవారం సందర్శించారు. అనంతరం గ్రామంలో మురుగుకాల్వలు, తాగునీటి ట్యాంకులు, బోరుమోటార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో మురుగుకాల్వలు, తాగునీటి ట్యాంకుల వద్ద పారిశుద్ధ్యం లోపించకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. దోమల నివారణకు మందు పిచికారీ చేయించాలని తెలిపారు. వనమహోత్సవంలో నాటిన మొక్కలను నీరుపోసి సంరక్షించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట స్థానిక ఎంపీడీఓ అపర్ణ, ఎంపీఓ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్, సిబ్బంది తదితరులున్నారు.

ఓఆర్ఆర్ పక్కకు డీసీసీబీ!

- తరలింపునకు సన్నాహాలు
- సుముఖంగా ఉన్న ప్రభుత్వం
- స్థలం కేటాయించగానే నిర్మాణం
- ఉద్యోగులు, పాలకవర్గానికి సులువు కానున్న రవాణా



నాంపల్లి రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న డీసీసీబీ కార్యాలయం

యాచారం: ఓఆర్ఆర్ పక్కకు డీసీసీబీ (జిల్లా సహకార కేంద్ర బ్యాంకు)ని తరలించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. నగరం మధ్యలో ఉన్న ప్రస్తుత కార్యాలయానికి రాకపోకలు సాగించడానికి ఉద్యోగులు, పాలకవర్గం సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ కార్యాలయంతో పాటు పలు శాఖల కార్యాలయాలన్నీ నగర శివారుకు తరలిచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకును సైతం నగర శివారులోకి మార్చడంపై సర్కార్ దృష్టి సారించింది. కొద్ది రోజుల క్రితం డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఈ విషయమై వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన స్పీకర్ వెంటనే కలెక్టర్ శశాంకకు ఫోను చేసి ఓఆర్ఆర్ పక్కన ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజకవర్గాల పరిధుల్లో 3 ఎకరాల స్థలాన్ని పరిశీలించాలని సూచించారు. లేదంటే 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్రస్తుత జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఎకరా, లేదా రెండు ఎకరాలు కేటాయించి అక్కడే నూతన కార్యాలయం నిర్మించేలా చూడాలని ఆయన కోరారు.


తీవ్ర ట్రాఫిక్ సమస్య

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 56 పీఏసీఎస్‌లు, 30 డీసీసీబీ బ్రాంచ్‌లు ఉన్నాయి. వీటి నుంచి నిత్యం అధికారులు, చైర్మన్లు మహానగరం మధ్యలో ఉన్న జిల్లా ప్రధాన కార్యాలయానికి రాకపోకలు సాగిస్తుంటారు. పరిగి, తాండూరు, వికారాబాద్, ఇబ్రహీంపట్నం, మేడ్చల్ తదితర నియోజకవర్గాల్లోని మండలాల నుంచి పీఏసీఎస్ చైర్మన్లు, సీఈఓలు, బ్యాంకు మేనేజర్లు వారానికి రెండు, మూడు రోజుల పాటు జిల్లా కేంద్ర కార్యాలయంలో జరిగే సమావేశాలకు హాజరవుతుంటారు. ఈ నేపథ్యంలో తీవ్ర ట్రాఫిక్ సమస్యతో వారు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి హాజరు కావాలంటే ఇంటి నుంచి ఉదయం 7 గంటలకే బయలుదేరాల్సి వస్తోంది. తిరిగి అర్ధరాత్రి ఇంటికి చేరుకోవాల్సి వస్తోంది.

నిధులకు కొరత లేదు

ఓఆర్ఆర్ పక్కన ఏదో ఒక నియోజకవర్గ పరిధిలో స్థలాన్ని కేటాయిస్తే జిల్లా సహకార కేంద్ర కార్యాలయాన్ని నిర్మించుకోవడం కోసం నిధులకు కొరత లేదు. ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ దాదాపు రూ.రెండు వేల కోట్లకు పైగా ఆర్థిక లావాదేవీలతో నడుస్తోంది. మొత్తం 1.60 లక్షలకు పైగా ఖాతాదారులున్న ఈ కేంద్ర బ్యాంకులో 70 వేల మంది రైతులు వివిధ రకాల కింద రూ.కోట్లాది రుణాలు పొందారు. సహకార కేంద్ర బ్యాంకు కూడా మంచి లాభాల్లో నడుస్తోంది. స్థలం చూపించిన వెంటనే అన్ని హంగులతో నూతన కార్యాలయ భవనాన్ని నిర్మించేందుకు డీసీసీబీ అధికారులు సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రంలోనే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్‌కు ప్రాధాన్యత ఉంది. మంచి లాభాల్లో నడుస్తున్న డీసీసీబీకి ఓఆర్ఆర్ పక్కనే స్థలం కేటాయించి భవనాన్ని నిర్మిస్తే ఆదర్శంగా నిలిచే అవకాశం ఉంటుంది.

అన్ని హంగులతో నూతన భవనం



ఓఆర్ఆర్ పక్కనే జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ కార్యాలయాన్ని నిర్మించడానికి ప్రభుత్వం ఆసక్తితో ఉంది. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పలువురు జిల్లా ఎమ్మెల్యేలు నూతన కార్యాలయ నిర్మాణానికి సహకరిస్తున్నారు. కలెక్టర్ స్థలం కేటాయిస్తే వెంటనే పనులు ప్రారంభిస్తాం. ప్రస్తుత సమీకృత కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఎకరా కేటాయించినా అన్ని హంగులతో నూతన భవనాన్ని నిర్మిస్తాం.

– కొత్తకుర్మ సత్తయ్య, డీసీసీబీ చైర్మన్

చౌదర్‌పల్లి పంచాయతీ కార్యదర్శిపై వేటు

యాచారం: ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రం జారీలో తీవ్ర వేధింపులకు పాల్పడి, ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి కారకురాలైన చౌదర్‌పల్లి పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్నపై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఆమె స్థానంలో గునుగల్ కార్యదర్శి శోభకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ శశాంక ఆదేశాల మేరకు శుక్రవారం ఇబ్రహీంపట్నం డీఎల్‌పీఓ సాధన విచారణ చేపట్టారు. చౌదర్‌పల్లి పంచాయతీ కార్యాలయానికి వచ్చిన డీఎల్‌పీఓకు స్థానికులు ఫిర్యాదు చేశారు. డబ్బులు తీసుకోనిదే ఆమె ఏ పనీ చేయదని ఆరోపించారు. చస్తేనేగానీ ఆస్తి విలువ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వారా అంటూ మండిపడ్డారు. అనంతరం డీఎల్‌పీఓ సాధన పంచాయతీ అధికారి శ్రీలతతో కలిసి ఆత్మహత్యాయత్నం చేసిన మధుసూదన్ ఇంటికెళ్లి కొలతలు తీసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్నపై వచ్చిన ఫిర్యాదులను కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.



చౌదర్‌పల్లి పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపడుతున్న అధికారులు



నృత్య ప్రదర్శన చేస్తున్న ఎంజేపీటీసీ విద్యార్థినులు

క్రీడల్లో విద్యార్థినుల ప్రతిభ

చేవెళ్ల: జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల బాలికలు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ నర్సింహ తెలిపారు. జిల్లాలోని ఇబ్రహీంపట్నంలో మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి క్రీడోత్సవాల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ఆయన చెప్పారు. మూడు వేల మీటర్ల పరుగు పందెంలో మొదటి బహుమతి, కబడ్డీలో ద్వితీయ, వాలీబాల్‌లో ద్వితీయ, చదరంగంలో ద్వితీయ, డిస్క్ త్రో ద్వితీయ సాధించారన్నారు. జిల్లాలోనే అత్యధిక పోటీలో తమ పాఠశాల విద్యార్థులు విజయం సాధించినట్లు పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థినులు చేసిన నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడలు నేర్పించిన పీఈటీలు ధనలక్ష్మి, ఎస్కార్ట్ టీచర్స్ పుష్యరాగం, సుశీల, అక్షితరెడ్డిలను ప్రత్యేకంగా అభినందించారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

రెండు తులాల బంగారు ఆభరణాలు, రూ.50వేల నగదు చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. కుర్మల్‌గూడ తిరుమల నగర్‌లో నివాసం ఉండే పోల్ కృష్ణ కుటుంబ సభ్యులు ఈ నెల 16న ఇంటి నుంచి జిల్లెలగూడకు వెళ్లారు. శుక్రవారం తిరిగి వచ్చారు. వారు వచ్చి చూసే వరకు తాళం పగలగొట్టి ఉండటం, బీరువా తెరిచి ఉండడం గమనించారు. బీరువాలోని రెండు తులాల బంగారం (నల్లపూసలు ,ముక్కుపుడక) ఆభరణాలు, రూ.50 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ రాజు ఆధ్వర్యంలో ఘటనా స్థలిని పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నిధులు లేక నీరసం

ఏడాది గడుస్తున్నా కదలని రోడ్డు నిర్మాణ పనులు

- ఖర్చు చేసిన డబ్బుకోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బంది పడుతున్న యాచారం–మాడ్గుల మండలాల సరిహద్దు ప్రజలు



మధ్యలోనే నిలిచిన రోడ్డు నిర్మాణ పనులు



కొత్తపల్లి–కొత్తపల్లి తండా రోడ్డు నిర్మాణానికి వేసిన శిలాఫలకం

యాచారం: సరిహద్దు రోడ్డుకు గ్రహణం పట్టింది. శిలాఫలకం వేసి ఏడాది గడుస్తున్న రోడ్డు మరమ్మతు పనులు ముందుకు సాగడం లేదు. యాచారం–మాడ్గుల మండలాల సరిహద్దులోని కొత్తపల్లి గ్రామం నుంచి మాడ్గుల మండల పరిధి నాగిళ్ల శివారు కలిసే ఆరు కిలోమీటర్ల పొడవు బీటీ రోడ్డు నిర్మాణానికి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం శిలాఫలకం వేసింది. ఈ మండలాల సరిహద్దులో తండాలు ఎక్కువగా ఉండడంతో గిరిజన సంక్షేమ శాఖ నుంచి 2023 ఆగస్టు 24న రూ.3.20కోట్ల నిధులతో చేపట్టే పనులకు అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి శిలాఫలకం ఆవిష్కరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డు మరమ్మతులు పట్టించుకునే వారు కరువయ్యారు.

పనులకు బ్రేక్

ఈ రోడ్డు కాంట్రాక్టర్ త్వరితగతిన పనులు పూర్తి చేయాలని రూ.50లక్షలకు పైగా వెచ్చించి పనులు చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన ఖర్చు చేసిన డబ్బుకు నిధులు విడుదల చేయాలని గిరిజన సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ శాఖల అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో సదరు కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశాడు. కొత్తపల్లి గ్రామం నుంచి కిషన్‌పల్లి మీదుగా మాల్ మార్కెట్‌కు బీటీ రోడ్డు నిర్మాణం కోసం మరో రూ.కోటిన్నర నిధులు మంజూరు చేశారు. ఆ రోడ్డు పనులు సైతం నిధులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి.

రేషన్‌కు సైతం వెళ్లని గిరిజనం

నేటికీ పనులు పూర్తి కాకపోవడంతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తపల్లి నుంచి ఆరు కిలోమీటర్ల దూరం అటవీ ప్రాంతం మధ్యలో కొత్తపల్లి గిరిజన తండా ఉంటుంది. వీరు అత్యవసరమైతేనే తండా నుంచి బయటకు వస్తారు. వీరు రేషన్ కావాలంటే కొత్తపల్లికి వెళ్లాలి, రోడ్డు నిర్మాణం పూర్తి కాకపోవడంతో రేషన్ సరుకులు తీసుకోవడమే మానేశారు. అవసరమైతే మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మాడ్గుల మండల పరిధిలోని నాగిళ్ల గ్రామానికి వెళ్లుతున్నారు. బీటీ రోడ్డు లేకపోవడంతో ఆర్టీసీ బస్సు సర్వీసులు కూడా లేవు. అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితి. విషసర్పాలు కాటేసినా, గాయాలపాలపైనా చెట్ల మందులతోనే వెళ్లదీస్తున్నారు.

ఏడాది గడిచింది



కొత్తపల్లి–కొత్తపల్లి తండా, కొత్తపల్లి–మాల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాది గడుస్తుంది. నిర్మాణ పనులు మధ్యలోనే వదిలేశారు. అధికారులు నిధులు లేవంటున్నారు. రోడ్డు మార్గం లేక తండావాలసులు రేషన్‌కు సైతం రావడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

– కావలి జగన్, మాజీ ఉప సర్పంచ్, కొత్తపల్లి

గిరిజనంపై చిన్న చూపు



తండాకు రోడ్డు బాగా లేక అంబులెన్స్‌లు కూడా రావడం లేదు. అత్యవసరమైనా కొత్తపల్లి వరకు నడుచుకుంటూ వెళ్లి అటునుంచి యాచారం ఆస్పత్రికి వెళ్తున్నాం. పాలకులకు గిరిజనంపై చిన్న చూపు. తమను పట్టించుకోకపోవడంతో ఇంకా అటవీప్రాంతంలోనే జీవించాల్సి వస్తోంది.

– కస్నా నాయక్, కొత్తపల్లి తండా

నిధులు లేకపోవడంతోనే



నిధులు లేకపోవడంతోనే కొత్తపల్లి–కొత్తపల్లి తండా, కొత్తపల్లి–మాల్ మధ్య రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రూ.50 లక్షల ఖర్చు చేసిన కాంట్రాక్టర్ నిత్యం తిరుగుతున్నాడు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తా. రోడ్డు మరమ్మతులు పూర్తి చేయించేందుకు కృషి చేస్తా, ఆందోళన చెందొద్దు.

– శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ, పంచాయతీ రాజ్ శాఖ

కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయిస్తామని..

హస్తినాపురం: కాంట్రాక్టు జూనియర్ లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయిస్తామని చెప్పి వారి నుంచి భారీగా వసూలు చేసి తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం ఠాణా పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. వనస్థలిపురం డీఐ రాజేశ్ తెలిపిన ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన అనిల్‌కుమార్, సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌కు చెందిన శేఖర్, రాజు, మరో వ్యక్తి ముఠాగా ఏర్పడ్డారు. కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయిస్తామని ప్రచారం చేసుకున్న వీరు దాదాపు 30 మంది రూ. లక్షలు వసూలు చేశారు. ఇటీవల ప్రభుత్వం 28 మందిని రెగ్యులరైజ్ చేయడంతో తమను ఎందుకు చేయలేదని బాధితులు నిలదీయడమేగాక తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని చేయడంతో తప్పించుకు తిరుగుతున్నారు. దీంతో చేసేది బాధితులు ఎల్బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం రాత్రి అనిల్‌కుమార్, శేఖర్‌లను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 68 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు పరారీలో ఉన్న రాజు, మరో వ్యక్తి కోసం గాలిస్తున్నారు.

మహిళ బలవన్మరణం

హస్తినాపురం: ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం సీఐ శ్రీనివాస్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నల్లగొండ జిల్లాకు చెందిన రోజా, మాలిక్ దంపతులు నగరానికి వచ్చి ఇంజాపూర్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి రోజా (25) ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండటాన్ని గుర్తించిన మాలిక్ ఇరుగుపొరుగు సహాయంతో ఆమెను కిందకు దింపి సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ రోజా శుక్రవారం మృతి చెందింది. మృతురాలి భర్త పిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి దర్శనానికి అనుమతించండి

ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: తెలంగాణ ఎమ్మెల్యేల సిఫారసు లేఖలతో భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించాలని టీటీడీ బోర్డును ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, రాష్ట్రం విడిపోయిన తర్వాత తిరుమలలో తెలంగాణ ఎమ్మెల్యేల లేఖలను తిరుమల తిరుపతి దేవస్థానం వారు అంగీకరించి భక్తులకు దర్శనానికి అనుమతించే వారని అన్నారు. ఇటీవల తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యేల సిఫారసు లేఖలను టీటీడీ బోర్డు తిరస్కరిస్తోందని.. వాటిని అనుమతించి దర్శనం కల్పించాలని కోరారు. తెలంగాణలోని భద్రాచలం, యాదగిరిగుట్ట తదితర పుణ్యక్షేత్రాల్లో ఏపీ ప్రజాప్రతినిధులకు ప్రాముఖ్యత ఇచ్చి గౌరవిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో నాయకులు విశ్వం, బాల్‌రాజ్‌గౌడ్, ప్రకాష్, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్



మాట్లాడుతున్న గోపాల్‌నాయక్

కడ్తాల్: ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్ట పరచాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ మండల మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గోపాల్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సమగ్రాభివృద్ధికి, ఉపాధ్యాయుల శ్రేయస్సుకు టీఎస్ యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పెండింగ్ ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్‌సీని అమలు చేయాలని, ఉపాధ్యాయులకు నూతన హెల్త్ స్కీం రూపొందించాలని డిమాండ్ చేశారు. జీఓ 317 బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని, స్పౌజ్ సమస్యను పరిష్కరించాలని కోరారు. వివిధ జిల్లాల నుంచి జిల్లాలోకి వస్తున్న ఉపాధ్యాయులను కట్టడి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు జంగయ్య, శంకర్‌నాయక్, మల్లయ్య, సత్యనారాయణ, విజయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, శ్రీనివాసులు, సత్యనారాయణ, భాగ్యలక్ష్మి, భీముడు, రవీందర్‌రెడ్డి బీరప్ప పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయండి

పంచాయతీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

కేశంపేట: ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలని పంచాయతీ వర్కర్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ఏఐటీయూసీ, గ్రామ పంచాయతీ వర్కర్స్ సంఘం సభ్యులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. భారతదేశాన్ని ఆంగ్లేయులు పాలిస్తున్న సమయంలో కార్మికుల ఉద్యమ హక్కుల సాధనకు ఏఐటీయూసీ ఏర్పడిందన్నారు. నాటి నుంచి నేటి వరకు ఎన్నో పోరాటాలు చేసి కార్మికుల హక్కులు సాధించామని గుర్తు చేశారు. ఈ నెల 31న మండల కేంద్రంలో నిర్వహించే సంఘం ఆవిర్భావ దినోత్సవానికి కార్మికులు, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు రవి, గ్రామ పంచాయతీ వర్కర్స్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ధర్నాలో పాల్గొన్న నేతలు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌తో స్థానిక బీజేపీ నాయకులు

చేవెళ్ల: మూసీ పునరుద్ధరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా నగరంలో బీజేపీ చేపట్టిన మహాధర్నాలో చేవెళ్ల నాయకులు పాల్గొన్నారు. శుక్రవారం నగరంలోని మూసీ, హైడ్రా బాధితులకు బీజేపీ అండగా ఉంటుందని చేపట్టిన ధర్నాకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్‌తో కలిసి భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, జయసింహ, ఇంద్రాసేనారెడ్డి, త్రినేత్ర, ఆనంద్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌రెడ్డి కుటుంబీకులకు త్రిపుర గవర్నర్ పరామర్శ



అల్వాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని రాగన్నగూడలో ఇటీవల మృతి చెందిన సామ అల్వాల్ రెడ్డి కుటుంబ సభ్యులను శుక్రవారం త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పరామర్శించారు. అల్వాల్ రెడ్డి సతీమణి సంధ్య, కూతుళ్లు దీక్షిత, వర్షితలతో మాట్లాడి ఓదార్చారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు క్లాం బాల్‌రెడ్డి, బోసుపల్లి ప్రతాప్, రమేష్ తదితరులున్నారు.

ప్రభుత్వ కళాశాలలో బాలల చోరీలు

శంషాబాద్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొంత కాలంగా నల్లా పైపులు, అద్దాలు ధ్వంసం చేయడం, పుస్తకాలు చోరీ చేస్తున్న నలుగురు బాలలను స్థానికులు పట్టుకున్నారు. ఈ మేరకు ఠాణాకు తీసుకెళ్లి విచారించిన పోలీసులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. నలుగురు కూడా పాఠశాల స్థాయి విద్యార్థులు కావడం గమనార్హం.

డార్క్ వెబ్‌పై ప్రత్యేక నిఘా

- సోషల్‌మీడియాను జల్లెడ పడుతున్నాం
- అత్యాధునిక టూల్స్ సమీకరించుకున్నాం
- నగరంలో డ్రగ్స్ దందాలను ఉపేక్షించం
- స్పష్టం చేసిన నగర కొత్వాల్ సీవీ ఆనంద్

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరంలో జరుగుతున్న డ్రగ్స్ దందాపై పటిష్ట నిఘా ఉంచామని కొత్వాల్ సీవీ ఆనంద్ తెలిపారు. హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్–న్యూ) పని తీరును సమీక్షించడంతో పాటు అదనపు సిబ్బంది, వనరులను సమకూర్చామన్నారు. శుక్రవారంసీసీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 'సింథటిక్ డ్రగ్స్ గోవా, బెంగళూరుల నుంచి.. గంజాయి సంబంధితమైనవి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఏపీలోని కొన్ని ప్రాంతాల నుంచి వస్తున్నాయి. ప్రస్తుతం బెంగళూరుపై కన్నేసి ఆపరేషన్లు చేస్తున్నాం. ఒడిశాలోని ఓ గ్రామంలో హష్ ఆయిల్ తయారీకి ఓ కర్మాగారం ఉన్నట్లు గుర్తించాం. త్వరలో టీజీ ఏఎన్‌బీ, ఏపీ పోలీసులతో కలిసి అక్కడ ఆపరేషన్ చేపట్టనున్నాం. స్నాప్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ సహా ప్రతి సోషల్‌మీడియాను పర్యవేక్షించడానికి, డార్క్ వెబ్‌పై కన్నేయడానికి ప్రత్యేక టూల్స్ సమీకరించుకున్నాం. పెడ్లర్లు, డెలివరీ బాయ్స్ ఇటీవలకాలంలో వర్చువల్ నెంబర్లు, వీపీఎన్ నెట్‌వర్క్స్ వాడుతున్నారు. తమ బ్యాంకు ఖాతాలు కాకుండా మనీ మ్యూల్స్‌వి, గుర్తింపుకార్డులు సైతం నకిలీవి వినియోగిస్తున్నారు. వీటన్నింటి పైనా పక్కా నిఘా ఉంచి, వారికి చెక్ పెట్టే సామర్థ్యం సముపార్జించుకున్నాం. నగరంలో సింథటిక్ డ్రగ్స్ వాడే వారిలో సంపన్నులు, వారి సంతానంతో పాటు ఐటీ ఉద్యోగులు, అప్పుడే కాలేజీల నుంచి చదువు పూర్తి చేసుకుని వచ్చిన విద్యార్థులు ఉంటున్నట్లు గుర్తించాం. శుక్రవారం దొరికిన ఇమ్రాన్ గ్యాంగ్‌లో గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి కీలకంగా ఉన్నట్లు తెలిసింది. అతను ఆ చుట్టుపక్కల ప్రాంతాలకు పెడ్లర్‌గా పని చేస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. స్టూడెంట్ వీసాపై వచ్చిన విదేశీయులు ఇక్కడ స్థిరపడుతున్నారు. వీరిపైన చర్యలు తీసుకోవడానికి అనేక అంతర్జాతీయ అంశాలు అడ్డు వస్తున్నాయి. ఇలాంటి వారిలో అసాంఘిక శక్తులు, నేరాలు చేసిన వారిని డిపోర్టేషన్ చేయడం పెద్ద ప్రహసనంగా మారింది. నగరంలోని కొన్ని లో లెవల్ పబ్స్‌లో యువతులతో డ్యాన్స్‌లు వంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. దీనిపై సమాచారంతో ఓ పబ్‌పై చర్యలు తీసుకున్నాం. మిగిలిన వాటిపైనా పటిష్ట నిఘా ఉంచాం. సికింద్రాబాద్ దేవాలయం ఉదంతంలో ఎలాంటి కుట్ర కోణం లేదు. నగర పోలీసులతో పాటు ముంబై ఏటీఎస్, ఎన్‌ఐఏ అధికారులూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కంప్యూటర్ ఇంజినీర్ అయిన ఆ నిందితుడిలో మతోన్మాదం ఉంది. ఆ కారణంగానే ఉద్యోగాలు పోగొట్టుకోవడంతో పాటు రెండుసార్లు జైలుకు వెళ్లాడు. డ్రగ్ పెడ్లర్స్‌ను పట్టుకోవడంలో అనేక రిస్కులు ఉంటాయి. అవన్నీ అధిగమిస్తూ ముందుకు వెళ్తున్న హెచ్–న్యూ సిబ్బందికి ప్రోత్సాహకాలు అందిస్తున్నాం' అని అన్నారు.